క్లుప్తంగా

రికార్డులు పరిశీలించిన సీఐ



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ ఖాజావలి

పీసీపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కనిగిరి సీఐ షేక్ ఖాజావలి బుధవారం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గస్తీలు ముమ్మరం చేయాలని, దొంగతనాలు జరగకుండా ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి దృష్టి సారించాలన్నారు. ఎస్సై కోటయ్య, సిబ్బంది ఉన్నారు.

రూ.20 వేల ఆర్థిక సాయం

వెలిగండ్ల.(కనిగిరి రూరల్): వెలిగండ్ల మండలం కంకణంపాడుకు చెందిన బచ్చలి హిమనోష్ కృష్ణా కుమార్ అనారోగ్యంతో బెంగళూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతనికి వైద్య ఖర్చులకు తనవంతు సాయంగా వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ రూ.20 వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందచేశారు. బచ్చలి హిమనోష్ కృష్ణా కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు

పొన్నలూరు: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల్లో బుధవారం పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు కృష్ణచైతన్య, రవికిరణ్ విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేస్తామన్నారు. విద్యార్థులు కంటి జాగ్రత్తలు తీసుకోని అప్పడప్పుడూ కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన చైర్మన్



విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని బీసీ హాస్టల్‌ను మున్సిపల్ చైర్మన్ గఫార్ బుధవారం పరిశీలించారు. హాస్టల్‌లో టాయ్‌లెట్స్ పరిసర ప్రాంతాలను, గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు.

రూ.30 వేల ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం చెక్కులు అందజేస్తున్న మానవత చైర్మన్, సభ్యులు

పామూరు: మండలంలోని పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున ఆర్థికసాయం అందజేసినట్లు చైర్మన్ కల్లూరి రామిరెడ్డి తెలిపారు. స్థానిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్థికసాయం చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, తోట రమేష్, యం.ముసలయ్య, పి.తిరుపతిరెడ్డి, బి.ఎస్.రంగారెడ్డి, పి.మాల్యాద్రి, ఎ.మాల్యాద్రి, యం.తిరుపతిరెడ్డి, ఆర్.నారాయణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్..బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు బీవీ సుబ్బారావు, కిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోతులతో బెంబేలు



హెచ్‌ఎంపాడు ప్రాథమిక పాఠశాల ప్రహరీపై ఉన్న కోతులు



కోతుల దాడిలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న ఆదిలక్ష్మమ్మ

హనుమంతునిపాడు:

గ్రామాల్లో కోతుల బెడదతో పిల్లలు, మహిళలు, వృద్ధులు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. బుధవారం మహ్మదాపురం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మమ్మ కోతిల దాడిలో గాయాల పాలైంది. ఇంటి ముందు మంచంపై పడుకోని ఉన్న ఆమెపైకి కోతులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయం వేస్తుందని మహిళలు వాపోతున్నారు. కోతుల దాడిలో గాయాలైన మహిళను హనుమంతునిపాడు పీహెచ్‌సీలో ప్రథమి చికిత్స చేయించుకోని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెవెళ్లారు. ఇటీవల గ్రామంలో కోతుల బెడద ఎక్కువైందని, ఐదుగురిని కరిచి గాయపరిచాయని చెబుతున్నారు. కూటాగుండ్ల, దాసళ్లపల్లి, తురకపల్లి, హాజీపురం, దొడ్డిచింతలో కూడా కోతులు కరిచి ఆస్పత్రిలో వైద్య చేయించుకున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ వారు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

చంద్రబాబు మోసాలు నిలదీయాలి



బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రజలకు చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కందుకూరు: ఎన్నికలకు ముందు ఇష్టారీతిన ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి మోసాలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ నేతలు ప్రజలకు సూచించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 6వ వార్డులోని కోటకట్ట వీధిలో వైఎస్సార్ సీపీ నేతలు పర్యటించారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్ ప్రయాణం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ వంటి సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వర్గానికి మేలు చేసే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అన్ని వర్గాలకు మేలు చేసిన ఏకైక నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని వివరించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఒకపక్క దోపిడీకి పాల్పడుతూ మరోపక్క ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుకునే ప్రయత్నంలో ఉందని వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, మండల అధ్యక్షుడు ఈదర రమేష్, నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిశోర్, రావులకొల్లు బ్రహ్మానందం, గేరా మనోహర్, వల్లూరి కోటేశ్వరరావు, యరమాల నాగభూషణం, ఉప్పులూరి రవీంద్ర, పెయ్యల రమేష్, సంధానీ, కూరపాటి వెంకట్రామిరెడ్డి, ఉప్పుటూరి నాగేశ్వర రావు, తల్లపనేని గోపీ, యడ్ల మాధవరెడ్డి, నగళ్ల నారయ్య, షేక్ రహీం, కానాల శివప్రసాద్, దండే రమేష్, పంది కోటేశ్వరరావు, కొచ్చెర్ల మాల్యాద్రి, కానాల ప్రసాద్, సుల్తాన్, బాబు, దేవరకొండ ఆదిలక్ష్మి, తుల్లూరి ఆదిలక్ష్మి, వసంతలక్ష్మి, ధరణి, ఆదాంబీ, కరిమున్నీసా పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలు గమనించాలి

ఉలవపాడు: చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రతి ఒక్కరూ గమనించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉలవపాడులోని దర్గా సెంటర్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, వాటిని అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న మోసాల గురించి వివరించారు. చంద్రబాబు పథకాలు అమలు చేయకుండా ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని తెలియజేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెలిచర్ల ధనకోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్, ఎంపీటీసీ రాధామాధవి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నవీన్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు ఆదాం, ఐటీ వింగ్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు యరమాల నాగభూషణం, రాష్ట్ర పార్టీ బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ గంగిరెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తోకల కొండయ్య, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్, కందుకూరు రూరల్ అధ్యక్షుడు ఈదర రమేష్, కరేడు గ్రామ కన్వీనర్ సీతారామిరెడ్డి, ఆత్మకూరు కన్వీనర్ వెంకటరామిరెడ్డి, వైద్యశాల కమిటీ మాజీ సభ్యుడు బ్రహ్మయ్య, మహిళా నాయకులు అనూరాధతో పాటు మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు హైస్కూల్ సంఘం వద్ద..

ఉలవపాడు పంచాయతీలోని హైస్కూల్ సంఘంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం జరుగుతుందని మండల అధ్యక్షుడు పోతురాజు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఖనిజ నిక్షేపాలు ధారాదత్తం చేయడం అన్యాయం

● సీపీఎం నాయకులు

లింగసముద్రం: లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో బయటపడిన ఖనిజ నిక్షేపాలను, యర్రారెడ్డిపాలెం, అయ్యవారిపాలెం ప్రాంతాల్లో భూములను సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. జిందాల్ కంపెనీ సిబ్బంది మిషనరీ ద్వారా తీస్తున్న ఐరన్ ముక్కలను పరిశీలించారు. ఈ ప్రాంతంతో వెలికి తీస్తున్న ఖనిజ సంపద ఆ ప్రాంత వాసులకే చెందాలని, జిందాల్ కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని సీపీఎం గుడ్లూరు ప్రాంతీయ కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి హెచ్చరించారు. అలా జరిగితే వివిధ పార్టీలు ఐక్యవేదికగా ఏర్పడి పెద్ద ఎత్తున ఉద్యం చేస్తామని హెచ్చరించారు. లింగసముద్రం మండలం లింగసముద్రం, ఎర్రారెడ్డిపాలెం, జంగారెడ్డి కండ్రిక, ఆర్ఆర్ పాలెం, వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లె తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములు, కొండలు, పట్టా భూములు



ఐరన్ ఓర్ నిక్షేపాలు వెలికి తీస్తున్న మిషనరీ

సుమారు 790 ఎకరాల జియోగ్రాఫికల్ సర్వే అధికారుల ద్వారా ఐరన్‌ఓర్ నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారించారని, ఈ సంపద అంతా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు గుట్టుచప్పుడు కాకుండా జిందాల్ కంపెనీకి కట్టబెట్టడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే ఖనిజ సంపదను వెలికితీసి ఈ ప్రాంతంలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిందాల్ కంపెనీకి, ఓఎన్‌జీసీ కంపెనీలకు ఎన్‌ఓసీ అనుమతులు ఇవ్వడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆస్తులు, పకృతి సంపదను కార్పొరేట్‌లకు కట్టబెట్టడానికి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. ప్రజలు ఏమైనా ఫర్వాలేదని, తమకు కార్పొరేట్ ప్రయోజనాలే ముఖ్యమనే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు ఉన్నాయన్నారు. ప్రజా ప్రతిఘటనతో ఖనిజ నిక్షేపాలు కాపాడుకుంటామని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల నాయకులు కొట్టే వెంకయ్య, సీహెచ్ కొండలరావు, దువ్వూరి జాన్ పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి ఆషాఢం సారె



ఆషాఢం సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

కందుకూరు: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అషాఢ మాస ప్రత్యేక విశిష్టతలో భాగంగా గ్రామ దేవత అంకమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. పట్టణంలోని పెద్దబజార్ కోదండ రామాలయం, పామూరు రోడ్డులోని ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో పట్టణంలో మేళతాళాలతో భారీ ఊరేగింపునకు బయల్దేరి బ్యాంకు బజార్, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా అంకమ్మతల్లి దేవాలయం చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమ ఇచ్చి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మహిళా భక్తుల కోలాటాల మధ్య అమ్మవారికి సారే సమర్పణ కార్యక్రమం వైభవంగా సాగింది. సమరసత సేవా ఫౌండేషన్ ప్రకాశం జిల్లా ధర్మ ప్రచారక్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంకమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పించే కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగిందన్నారు. సహకరించిన తటవర్తి జానీ, ఇస్కాల శోభారాణి, మాధురిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సహ కన్వీనర్ సాధన, కందుకూరు ఖండ కన్వీనర్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఆర్ఎస్ఎస్ కందుకూరు సంఘ చాలక్ డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, ఖండ ధర్మప్రచారక్ అనిల్, మండల మహిళా సహ కన్వీనర్ సత్యవతి, మంచిరాజు మురళీమోహన్, మురారిశెట్టి వెంకట సుబ్బారావు, కోట వెంకటనరశింహం, పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, మాదాల మాల్యాద్రి, డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, గుర్రం చినఅల్లూరయ్య, మురారిశెట్టి స్వామి, ఇస్కాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రేజింగ్ భూముల ఆక్రమణ

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం సర్వే నంబర్ 1లోని 512 ఎరాల గ్రేజింగ్ భూములు ఉన్నాయి. ఈ భూముల్లోని 150 ఎకరాలను కొందరు ఆక్రమించి చెట్లు పీకించారు. కొన్ని సంవత్సరాలుగా బీడు భూమలుగా ఉండటంతో పశువులు, మేకలు, గొర్రెలు తిరుగుతుండేవి. కూటమి ప్రభుత్వంలో కొందరు గ్రేజింగ్ భూములను ఆక్రమించి ఐదు జేసీబీలతో చెట్లు పీకించి చదును చేస్తుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేజింగ్ భూములను ఆక్రమించడంతో పశువులు, మేకలు, గొర్రెలు తిరిగేందుకు వీల్లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో అక్కడకు వెళ్లి చెట్లు పీకుతున్న జేసీబీలను అడ్డుకున్నారు. గ్రేజింగ్ భూముల ఆక్రమణపై తహసీల్దార్ ఎస్.సీతామహాలక్ష్మి, ఆర్ఐ రమణయ్యలను వివరణ కోరగా గ్రేజింగ్ భూములు ఆక్రమిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో వీఆర్వోను పంపించామని, వీఆర్వో అక్కడకు వెళ్లడంతో వారు అక్కడి నుంచి వెళ్ళిపోయినట్లు చెప్పారు. విచారించి గ్రేజింగ్ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



గ్రేజింగ్ భూముల్లో చెట్లు పీకుతున్న జేసీబీ

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

హనుమంతునిపాడు: మండలంలోని వీరరాంపురంలోని అగ్రిగోల్డ్ భూములను తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరరాంపురం రెవెన్యూలో సర్వే నం.13,14,7,3,15,19లలో అగ్రిగోల్డ్‌కు చెందిన 226 ఎకరాల్లో జామాయిల్ సాగులో ఉంది. ఈ క్రమంలో కొంత మంది ఆక్రమణదారులు అందులోని జామాయిల్ చెట్లను నరికేసి కర్రలను తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ రమేష్‌బాబు, ఆర్ఐ డి.కృష్ణచైతన్య, వీఆర్ఓ సూరేబోయిన కాశయ్య, జేమ్స్, సర్వేయర్లు పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ భూములు పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగూల్ మీరా

ప్రభుత్వంపై మహిళల తిరుగుబాటు ఖాయం

కనిగిరిరూరల్: ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం ఆశ్చర్యకంగా ఉందని, సంక్షేమ పథకాల హామీలకు ఎగనామం పెట్టేందుకే కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికలకు ముందు అలివిమాలిన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సంపద సృష్టిస్తా.. సంక్షేమ పథకాలు అమలు చేస్తానని మోసపూరిత వాగ్దానాలు చేసి.. ఇప్పుడు చేతులెత్తేయడం సిగ్గు చేటన్నారు. మహిళల ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురి కాక తప్పదన్నారు. కూటమి సర్కార్ ఇచ్చిన ఎన్నికల హామీల సంక్షేమ పథకాలను అమలు చేసేంత వరకు ప్రజా పక్షాన పోరాటం చేస్తామని దద్దాల నారాయణ అన్నారు.



దద్దాల నారాయణ యాదవ్

అండ్ర రామలింగేశ్వర స్వామి భూముల వేలం

మర్రిపూడి: మండలంలోని కూచిపూడి గ్రామంలోని అండ్ర రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 170.8 ఎకరాల భూమికి స్థానిక శివాలయంలో ఈఓ ఎస్ నారాయణరెడ్డి బుధవారం వేలంపాట నిర్వహించారు. మండలంలోని వల్లాయపాలెం, కూచిపూడి, వేమవరం, కొత్తూరు, నర్సాపురం, రేగలగడ్డ తదితర గ్రామాల్లోని భూములను ఆయా గ్రామాలకు చెందిన 41 మంది రైతులు ఒక్కొక్కరు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామి భూములను రూ.7.66లక్షలకు రైతులు పాడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీ సుబ్రహ్మణ్యం, కె.శ్రీను పి.మురళీ, గూడలి కృష్ణ చైతన్యశర్మ పాల్గొన్నారు.



కూచిపూడిలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

పామూరు: ఒంగోలులో ఆగస్టు 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న భారత సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక విరాట్‌నగర్‌లో బుధవారం సీపీఐ జిల్లా మహాసభల ప్రచార పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రభుత్వరంగ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతోందన్నారు. కార్మికుల పక్షాన పోరాడిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు.



ప్రచార పత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మెనూ విధిగా అమలు చేయాలి

సీఎస్‌పురం(పామూరు): మధ్యాహ్న భోజనంలో మెనూ విధిగా అమలు చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం, అరివేముల ఉన్నతపాఠశాలలు, ముండ్లపాడు, చింతలపాలెం, అరివేముల ప్రాథమిక పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, టీఎంఎఫ్ రిజిస్టర్లు, శానిటరీ నాప్‌కిన్ రిజిస్టర్లలో కచ్చితమైన వివరాలు మాత్రమే నమోదు చేయాలని ఎంఈఓ సూచించారు. సెప్టెంబర్ 15వ తేదీ లోగా ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శనలకు 6వ తరతగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు నమోదు చేసుకోవాలన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

నోట్ పుస్తకాల పంపిణీ

కందుకూరు రూరల్: చేయి చేయి కలుపుదాం..ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం.. అనే నినాదంతో మేక్ ఏ చేంజ్ సొసైటీ సహకారంతో బుధవారం కందుకూరు జనార్దనకాలనీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా మేక్ ఏ చేంజ్ సొసైటీ ద్వారా ఎన్నో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని వారి సంస్థ ద్వారా అందిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేయటం ఆనందంగా ఉందన్నారు. మేక్ ఏ చేంజ్ సొసైటీ సభ్యులు రవ్వ శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, పాఠశాల వైస్ చైర్మన్ రామరాజు, ఉపాధ్యాయులు బి.పద్మజ, అత్తోట రమేష్, ఇర్షాద్ అహ్మద్, రాధిక పాల్గొన్నారు.



విద్యా సామగ్రితో విద్యార్థులు, సొసైటీ సభ్యులు

కాళహస్తీశ్వరునికి మహా రుద్రాభిషేకం

ఉలవపాడు: మండలంలోని కరేడులో వెలసిన జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి బుధవారం మహారుద్రాభిషేకం చేశారు. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గ్రామరక్షణ కోసం 121 రుద్రాలతో 15 మంది వేదపండితులతో ఈ మహారుద్రాభిషేకం జరిపారు. పాడిపంటలతో గ్రామం బాగుండాలని బ్రాహ్మణోత్తములు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.